# నిషేధిత భూములపై ప్రజలు ఆందోళన చెందొద్దు

మొదటిపేజీ తరువాయి

తద్వారా ఫోర్జరీ డాక్యుమెంట్లకు చెక్ పెట్టవచ్చని రిజిస్ట్రేషన్ సమయంలో సబ్ రిజిస్ట్రార్‌లకు స్పష్టత వస్తుందని, ఏది బోగస్ డాక్యుమెంట్, ఏది నిజమైన డాక్యుమెంట్ అనేదానిపై సూపర్ చెక్ చేసుకోవడానికి వీలుకలుగుతుందన్నారు. మరింత పారదర్శకత కోసం పహానీలు కూడా సబ్ రిజిస్ట్రార్‌కు ఆక్సెస్ ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వచ్చిన దరఖాస్తుల్లో ఏది నిజమో కాదో అన్నది యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని కలెక్టర్లకు సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలు, సూచనలకు అనుగుణంగా ప్రజా కోణంలో ఆలోచించి కలెక్టర్లు నిర్ణయాలు తీసుకోవాలని అన్నారు. ఈ విషయంలో కలెక్టర్లు మరింత క్రియాశీలక పాత్ర పోషించాలన్నారు. మంగళవారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలోహైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, సంగారెడ్డి కలెక్టర్లు, జిల్లా సబ్‌రిజిస్ట్రార్లతో మంత్రి సుదీర్ఘంగా చర్చించారు.

22ఎకు సంబంధించి ప్రజావాణితో పాటు కలెక్టర్లు, ఆర్డీవోలు, తహశీల్దార్లకు, సబ్ రిజిస్ట్రార్లకు జిల్లాల వారీగా వచ్చిన దరఖాస్తులు ఎన్ని, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో కూలంకషంగా చర్చించారు. సమస్య వచ్చినపుడు పరిష్కరించేదానికన్నా సమస్య రాకుండా చూడాల్సిన బాధ్యత జిల్లా కలెక్టర్లపై ఉందన్నారు. పిఓబి దరఖాస్తులకు సంబంధించి కేస్‌బై కేస్ ప్రతి రోజూ సమీక్షించాలి. 22ఎ పేరిట ఉద్దేశపూర్వకంగా పేదోడికి అర్హులకు అన్యాయం చేసే విధంగా వ్యవహరిస్తే ఊరుకునేదిలేదు.

సబ్ రిజిస్ట్రార్లకు విచక్షణాధికారాలు ఉండకూడదని అదనపు అధికారాలు వద్దని ఈ విషయంపై గతంలోనే చాలా స్పష్టత ఇచ్చాను. ఆన్‌లైన్‌లో ఏది ఉంటే దానికి ఆమోదం తెలిపేవరకే వారి అధికారాలను పరిమితం చేయాలని అధికారులను ఆదేశిస్తున్నాను. ప్రభుత్వ ఆస్తులను కాపాడే విషయంలో ఏమాత్రం రాజీపడే ప్రసక్తేలేదు. ఏ చిన్న తప్పుచేసినా క్షమించేదిలేదు, కఠిన చర్యలు తీసుకుంటానని అన్నారు. ఏదైనా సమస్య ఉంటే జిల్లా సబ్ రిజిస్ట్రార్‌లు కలెక్టర్ దృష్టికిగాని ఐజీ దృష్టికి గాని తీసుకురావాలి. పిఓబీ జాబితాలో ఉన్న ఆస్తుల రిజిస్ట్రేషన్‌లను గుడ్డిగా తిరస్కరించకుండా మూడు రోజుల సమయం తీసుకొని ఎందుకు తిరస్కరించవలసి వస్తుందన్న వివరాలను తెలియజేయాలి. పిఓబీకి సంబంధించి వచ్చిన ప్రతి దరఖాస్తును ఇకనుండి తహశీల్దార్‌కు పంపకుండా నేరుగా కలెక్టర్‌కే పంపించాలి. కలెక్టర్ నుండి డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్, డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్ నుండి కలెక్టర్ మధ్యనే ఉత్తర ప్రత్యుత్తరాలు జరగాలి, గతంలో నాన్ అగ్రికల్చర్, అగ్రికల్చర్, పీఓబీ జాబితాలు వేర్వేరుగా ఉండేవి. వీటిని సమీకృతం చేయడం వలన సబ్ రిజిస్ట్రార్ పరిశీలనలో కొన్ని ఆస్తులు, నిషేధిత జాబితాలో ఉన్నట్లు కనిపిస్తున్నందున మొత్తం రిజిస్ట్రేషన్ ఆపుతున్నారని ఫిర్యాదుల వస్తున్నాయి. తాజాగా అప్‌లోడ్ చేస్తున్న సమాచారంతో సరిపోల్చుకొని నిర్ణయాలు తీసుకోవాలన్నారు. నాలుగు జిల్లాల పరిధిలోని సబ్ రిజిస్ట్రార్ లతో సమావేశం నిర్వహించి ఉన్నత స్థాయి సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను వారికి తెలియజేసి తక్షణం అమలుచేసే విధంగా చర్యలు తీసుకోవాలని స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ శాఖ ఐ.జి. ని ఆదేశించారు. ఈ సమావేశంలో రెవెన్యూ సెక్రెటరీ డి.ఎస్. లోకేశ్ కుమార్, స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ ఐ.జి. రాజీవ్ గాంధీ హనుమంత్, ఆయా జిల్లాల కలెక్టర్లు, జిల్లా రిజిస్ట్రార్ లు పాల్గొన్నారు.

# నిర్ణీత గడువులోగా ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ పూర్తి

మొదటిపేజీ తరువాయి

మాట ప్రకారం చేసి తీరాల్సిందేనని సమీక్షలో మంత్రి పునరుద్ఘాటించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం పూర్తి జవాబుదారిగా వ్యవహరిస్తుందనీ,ఏళ్ల తరబడి అవస్థ పడుతున్న ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా సురక్షిత ప్రయాణం అందించేలా చేద్దామని,అందుకు అనుగుణంగా అధికారులు మనసుపెట్టాలని ప్రత్యేకంగా కోరారు. మ్యాన్ పవర్ పెంచి..మూడు షిఫ్టుల్లో పనులు చేయాలనీ,రాత్రి వేళల్లో 11 నుండి ఉదయం 6గంటల వరకు నిరంతరాయంగా పనులు జరగాలనీ మంత్రి ఆదేశించారు.కారిడార్ కింద 6.25కి.మీ బిటి రోడ్డు పనులు ఈ నెలాఖరుకు పూర్తి చేయాలని తేల్చి చెప్పారు. ప్రతి పది రోజులకు ఒకసారి తాను స్వయంగా క్షేత్రస్థాయి పనుల పురోగతి సమీక్షిస్తానని.. అందుకు తగ్గట్టుగా రోజువారీ వర్క్ ప్రోగ్రెస్ అధికారులు సమీక్షించాలని మంత్రి ఆదేశించారు. ÷-రస్తుతం క్షేత్ర స్థాయిలో నడుస్తున్న పనులపై మంత్రి కూలంకషంగా చర్చించారు.. సైట్ లోని కచ్చితమైన వాస్తవ పరిస్థితులు చెప్పాలని మంత్రి అధికారులు,వర్క్ ఏజెన్సీని అడిగారు. ప్రస్తుతం ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ 60? మేర పనులు పూర్తయ్యాయని మరో 40శాతం పనులు వేగంగా జరుగుతున్నాయని అధికారులు,వర్క్ ఏజెన్సీ ప్రతినిధులు వివరించారు. ఇరువైపుల లాంచింగ్ గడ్డర్లతో పనుల్లో వేగం పెంచాలనీ మంత్రి సూచించారు. ఉప్పల్ వైపు నుండి జరుగుతున్న పనుల పురోగతిని మంత్రి ఆరా తీశారు..ఇప్పటికే ఒక స్లాబ్ పూర్తయిందని,రెండో స్లాబ్ పనులు పురోగతిలో ఉన్నాయని అధికారులు వివరించారు. ప్రస్తుత పరిస్థితుల్లో రాత్రిపూట పనుల వల్ల,వర్షాల వల్ల నిర్మాణం పూర్తికి మరింత సమయం పట్టే అవకాశం ఉన్నదనీ నిర్మాణ సంస్థ సమీక్ష సందర్భంగా విజ్ఞప్తి చేసింది. 2026 అక్టోబర్ 31 నాటికి అందుబాటులోకి తెస్తామని ఇప్పటికే డెడ్ లైన్ పెట్టుకున్నాం..ప్రజల ట్రాఫిక్ ఇబ్బందులు గురించి ఆలోచించాలని మంత్రి అన్నారు. వర్క్ ఏజెన్సీ విజ్ఞప్తి పట్ల మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. నుల్లో మరింత వేగం పెంచాలని,మ్యాన్ పవర్ పెంచి మూడు షిఫ్టుల్లో పనిచేయాలని తెగేసి చెప్పారు. నెలకు ఆరు స్లాబుల చొప్పున పూర్తి చేస్తామని నిర్మాణ సంస్థ మంత్రికి తెలిపింది.

అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనులు సమాంతరంగా పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. 2026 సంవత్సరంలో ఎట్టి పరిస్థితుల్లో ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ ప్రజలకు అందుబాటులోకి తేవాల్సిందేనని ఆర్ అండ్ బి అధికారులు,వర్క్ ఏజెన్సీ ఆ దిశగా పనిచేయాలని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు.

# 3.43 కోట్ల మందికి 'స్మార్ట్' ఆహార భద్రత

మొదటిపేజీ తరువాయి

2025 జనవరి 26 నుంచి ఇప్పటి వరకు 16,32,810 కొత్త ఆహార భద్రత కార్డులను జారీ చేసి, వాటి ద్వారా 61,08,544 మంది లబ్దిదారులకు ఆహార భద్రత కల్పించినట్లు మంత్రి వెల్లడించారు. ఆగస్టు 2026 నాటికి రాష్ట్రంలో మొత్తం ఆహార భద్రత కార్డుల సంఖ్య 1.06 కోట్లకు చేరిందన్నారు. తెలంగాణలో ఆహార భద్రత కార్యక్రమం ఏ స్థాయిలో కొనసాగుతోందో ఇందుకు ప్రభుత్వం చేస్తున్న వ్యయమే నిదర్శనమన్నారు. రేషన్ బియ్యం కోసం ఏటా సుమారు రూ.14 వేల కోట్లు, రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు మరో రూ.20 వేల కోట్ల వరకు ప్రభుత్వం వెచ్చిస్తోందని తెలిపారు. సంగారెడ్డి కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. లబ్దిదారుల తరలింపు, సీటింగ్, భద్రత, కార్డుల పంపిణీతో పాటు ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన ప్రతి అంశాన్ని ముందుగానే పకడ్బందీగా ప్రణాళిక చేయాలన్నారు. కార్యక్రమానికి సంబంధించిన మినిట్-టు-మినిట్ షెడ్యూల్ సిద్ధం చేసి నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని సూచించారు. మాజంలోని వివిధ వర్గాలకు ప్రాతినిధ్యం వహించే వాస్తవ లబ్దిదారులను గుర్తించి ముఖ్యమంత్రి చేతుల మీదుగా స్మార్ట్ రేషన్ కార్డులు అందించాలని చెప్పారు. అనంతరం రాష్ట్రవ్యాప్తంగా కార్డుల పంపిణీలో లబ్దిదారుల గుర్తింపును ధ్రువీకరించి, పూర్తి పారదర్శకతతో కార్డులు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మిగిలిన జిల్లాల్లో నిర్వహించే కార్యక్రమాలకు సంబంధించి కలెక్టర్లకు స్పష్టమైన మార్గదర్శకాలు పంపాలని, అవసరమైన వ్యయంపై ముందుగానే స్పష్టత ఇవ్వాలని పౌర సరఫరాల శాఖ అధికారులకు సూచించారు. తెలంగాణలో 1.06 కోట్ల ఆహార భద్రత కార్డుల ద్వారా 3.43 కోట్ల మంది ప్రజలకు ఆహార భద్రత కల్పిస్తున్నాం. ప్రతి అర్హుడికి నెలకు ఆరు కిలోల సన్నబియ్యాన్ని ఉచితంగా అందిస్తున్నాం. ఇంత భారీ సంక్షేమ కార్యక్రమాన్ని మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా లబ్దిదారుడి చెంతకు తీసుకెళ్లడమే స్మార్ట్ రేషన్ కార్డుల లక్ష్యం' అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వ ఆహార భద్రత కార్యక్రమం విస్తృతిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని మంత్రి అధికారులను ఆదేశించారు. 1.06 కోట్ల కార్డులు?3.43 కోట్ల లబ్దిదారులు?ఉచిత సన్నబియ్యం వంటి కీలక అంశాలతో ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాతో పాటు షార్ట్ వీడియోలు, రీల్స్ ద్వారా విస్తృత ప్రచారం చేపట్టాలని సూచించారు. ఆగస్టు 15 నాటికి అన్ని ఏర్పాట్లను పూర్తి చేసి, సంగారెడ్డి రాష్ట్రస్థాయి కార్యక్రమంతో పాటు 33 జిల్లాల్లో జరిగే పంపిణీ కార్యక్రమాలను క్రమశిక్షణతో, పారదర్శకంగా, నిర్వహించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

# పత్తి కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు రాకుండా చూడాలి

**హైదరాబాద్,ఆగస్ట్11 :** రాష్ట్రంలో రానున్న 2026-27 పత్తి సీజన్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పత్తి కొనుగోళ్లు సజావుగా, పారదర్శకంగా నిర్వహించాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. పత్తి కొనుగోలు ఏర్పాట్లపై సీసీఐ అధికారులతో హైద్రాబాద్ లో మంత్రి తుమ్మల సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కష్టపడి పంట పండించిన రైతులకు మార్కెటింగ్‌లో ఎక్కడా ఇబ్బంది కలగకూడదని, ఒకరిద్దరి కారణంగా మొత్తం వ్యవస్థలకు చెడ్డపేరు రాకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. 'మనం బతకాలంటే రైతు బతకాలి' అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకుని పనిచేయాలని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో ముందుకు వెళ్లి పత్తి రైతులకు మద్దతు ధర అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. పంట కోతకు దాదాపు రెండు నెలల ముందుగానే పత్తి కొనుగోళ్లపై సమీక్ష నిర్వహించడం మంచి పరిణామమని పేర్కొన్నారు. తెలంగాణలో ప్రకృతిపై ఆధారపడి పత్తి సాగు చేసే రైతులలో సన్న చిన్నకారు రైతులే అధికంగా ఉన్నందున, వారి ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కొనుగోలు ప్రక్రియను ముందుగానే పకడ్బందీగా సిద్ధం చేయాలని ఆదేశించారు. పత్తి కొనుగోలు ప్రక్రియలో మధ్యవర్తుల జోక్యానికి ఎలాంటి అవకాశం ఇవ్వకూడదని మంత్రి స్పష్టం చేశారు. రైతుల నుంచి నేరుగా, పారదర్శకంగా పత్తి కొనుగోలు జరిగేలా అధికారులు పర్యవేక్షించాలని అన్నారు. గత సీజన్లలో పత్తి కొనుగోళ్లపై విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం గుర్తించిన అంశాలను పూర్తిగా పరిగణనలోకి తీసుకుని, ఈ సీజన్‌లో అటువంటి లోపాలు, అవకతవకలు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 2026-27 సీజన్‌లో రాష్ట్రంలో సుమారు 46.33 లక్షల ఎకరాల్లో పత్తి సాగు జరుగుతుందని, సుమారు 25.85 లక్షల మెట్రిక్ టన్నుల పత్తి ఉత్పత్తి అయ్యే అవకాశం ఉన్నట్టు అంచనా వేసినట్టు మంత్రి తెలిపారు. ఈ సీజన్‌కు కేంద్ర ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.8,667 కనీస మద్దతు ధర ప్రకటించిందని, గత ఏడాదితో పోలిస్తే రూ.557 పెరిగిందని చెప్పారు. ప్రతి అర్హత కలిగిన రైతుకు ప్రయోజనం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, రైతులు మద్దతు ధర కంటే తక్కువ ధరకు పత్తిని విక్రయించే పరిస్థితి ఎట్టి పరిస్థితుల్లోనూ రావద్దని ఆదేశించారు. రాష్ట్రంలోని 356 జిన్నింగ్ మిల్లులను నోట్గి÷ చేసి పత్తి కొనుగోళ్లు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అన్ని కేటగిరీల మిల్లులను అవసరానికి అనుగుణంగా ఒకేసారి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గత సీజన్‌లో 122 కొనుగోలు కేంద్రాలు ఉండగా, ఈ సీజన్‌లో వాటి సంఖ్యను 131 కేంద్రాలకు పెంచినట్లు మంత్రి తెలిపారు. అన్ని కేంద్రాలు పూర్తిస్థాయిలో పనిచేసేలా ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. మార్కెట్ కు పత్తి రాక అధికంగా ఉండే ప్రాంతాల్లో అవసరమైన మేరకు అదనపు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఒక ప్రాంతంలో జిన్నింగ్ మిల్లు అందుబాటులో లేకపోతే, సంబంధిత గ్రామాలు, మండలాలను సమీపంలోని నోటిఫైడ్ మిల్లుకు అనుసంధానం చేసి రైతులకు ఎక్కువ దూరం ప్రయాణించకుండా చూడాలన్నారు. ప్రతి జిల్లాలో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి మానిటరింగ్ కమిటీలు సమర్థవంతంగా పనిచేయాలని మంత్రి ఆదేశించారు. ఈ కమిటీల్లో రైతుల ప్రతినిధులను కూడా చేర్చుకోవాలని సూచించారు. మార్కెట్ యార్డులు, జిన్నింగ్ మిల్లుల వద్ద పత్తి రాకను క్రమబద్ధీకరించాలని, అవసరమైతే సాయంత్రం 6 గంటల తర్వాత కూడా కొనుగోలు సమయాన్ని స్థానిక కమిటీలు పరిస్థితులకు అనుగుణంగా పొడిగించాలని చెప్పారు. జిల్లాస్థాయి అధికారులు కార్యాలయాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో కొనుగోలు కేంద్రాలను స్వయంగా పర్యవేక్షించి రైతులకు ఎదురవుతున్న సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాలని ఆదేశించారు. పాస్ కిసాన్ యాప్ లో స్లాట్స్ ఓపెన్ చేసే ముందు సంబంధిత జిల్లా కలెక్టర్, జిల్లా మార్కెటింగ్ అధికారులకు సమాచారం అందించి రైతులకు విస్తృతంగా ప్రచారం చేయాలని మంత్రి సూచించారు. స్లాట్ బుకింగ్ విధానాన్ని మరింత సరళీకృతం చేసి, ఒక రైతు లేదా మొబైల్ నంబర్‌కు అవసరమైన విధంగా మల్టిపుట్ బార్ కోడ్ సౌకర్యం కల్పించాలని అన్నారు.

# చేయూత కొత్త పింఛన్లకు దరఖాస్తుల స్వీకరణ

మొదటిపేజీ తరువాయి

తొలిదశలో ఒంటరి మహిళలు, వితంతువులు, దివ్యాంగులు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, ఫైలేరియా బాధితులు, తలసేమియా, సికిల్ సెల్ వ్యాధి, హీమోఫీలియా వంటి రక్త సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారికి కొత్త పింఛన్లు మంజూరు చేయనున్నారు. కొత్త పింఛన్ల కోసం అర్హత ప్రమాణాల్లో ఎలాంటి మార్పు చేయలేదు. గత ప్రభుత్వాల హయాంలో జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వుల్లో పేర్కొన్న ఎలిజిబిలిటీ క్రైటీరియానే ప్రస్తుత ప్రభుత్వం కూడా ప్రామాణికంగా తీసుకుంటోంది. 2014 నుంచి 2018 మధ్య జారీ చేసిన సంబంధిత ప్రభుత్వ ఉత్తర్వుల్లోని నిబంధనల ప్రకారమే అర్హతను పరిశీలిస్తారు. ప్రజాపాలన వారోత్సవాలు, 99 రోజుల ప్రగతి ప్రణాళిక గ్రామసభలు, ప్రజావాణిలో ఇప్పటికే అందిన దరఖాస్తులను కూడా పరిగణనలోకి తీసుకుంటారు. గతంలో దరఖాస్తు చేసి, అవసరమైన అన్ని పత్రాలు సమర్పించిన వారు మళ్లీ దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదు. అవసరమైన పత్రాలు సమర్పించని వారు లేదా ఇప్పటి వరకు దరఖాస్తు చేయని అర్హులు కొత్తగా దరఖాస్తు చేసుకోవచ్చు.

అర్హత నిర్ధారణ కోసం సంబంధిత శాఖల నుంచి అవసరమైన ధ్రువపత్రాలను పొందేలా జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకుంటారు. వితంతువులకు భర్త మరణ ధ్రువపత్రం, ఒంటరి మహిళలకు సెపరేషన్ లేదా స్థానిక విచారణ నివేదిక, గీత కార్మికులకు ఎక్సైజ్ శాఖ ధ్రువీకరణ, చేనేత కార్మికులకు చేనేత-జౌళి శాఖ ధ్రువీకరణ, ఫైలేరియా బాధితులకు వైద్య ఆరోగ్య శాఖ ధ్రువీకరణ అవసరం. దరఖాస్తుల పరిశీలన అనంతరం నిర్దేశిత అధికారులు క్షేత్రస్థాయిలో అర్హతను తనిఖీ చేస్తారు. ఆ తర్వాత అర్హుల జాబితాను జిల్లా స్థాయికి పంపి, జిల్లా కలెక్టర్ ఆమోదంతో పింఛన్ మంజూరు ప్రక్రియ పూర్తి చేస్తారు. ప్రతి అర్హుడికి చేయూత అందించాలనే ఉద్దేశంతో స్వయం సహాయక సంఘాల సమాఖ్యలకు కూడా బాధ్యతలు అప్పగించారు. ముఖ్యంగా ప్రతి అర్హత కలిగిన వితంతువు, ఒంటరి మహిళకు దరఖాస్తు చేసుకోవడం, అవసరమైన ధ్రువపత్రాలు పొందడంలో సహకరించాలని సూచించారు. కొత్త పింఛన్ల కోసం దరఖాస్తులను ఆగస్టు 31 వరకు స్వీకరిస్తారు. దరఖాస్తులతో పాటు వివరాలను చేయూత పోర్టల్‌లో నమోదు చేసే ప్రక్రియను కూడా వెంటనే చేపట్టనున్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా పారదర్శకంగా, నిబంధనల ప్రకారం ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. అర్హులైన వారికి సామాజిక భద్రత కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రక్రియను వేగవంతం చేసింది.

# ఆ సంస్థతో సిఎం సోదరుడికి సంబంధం లేదు

మొదటిపేజీ తరువాయి

మీడియాతో చిట్‌చాట్‌లో శ్రీధర్‌బాబు మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో ఎకరం రూ.90లక్షలకు ఇస్తే.. మేం రూ.కోటిన్నరకు ఇచ్చాం. బోర్డు డిసైడ్ చేసిన దానికంటే రూపాయి కూడా తక్కువకు ఇవ్వలేదు. 32 మంది దరఖాస్తు చేసుకుంటే అందులో ఒకటి టెసరాట్ కంపెనీ. నిబంధనల ప్రకారమే కేటాయింపులు జరిగాయి. ఆ సంస్థతో సీఎం రేవంత్ సోదరులకు సంబంధం లేదు. సోషల్ మీడియా పోస్టుల ఆధారంగా ఆయన ఆరోపణలు చేయడం.. ఐదు ఎకరాల్లో రూ.34 కోట్లతో ఏర్పాటయ్యే కంపెనీని రూ.200 కోట్ల సంస్థగా కేటీఆర్ చెప్పడం ఆశ్చర్యంగా ఉందన్నారు. బీఆర్ఎస్ హయాంలో ముడుపులు తీసుకునే కంపెనీలకు భూములు ఇచ్చారా? తక్కువ ధరకు ఎందుకు ఇచ్చారో కేటీఆర్ సమాధానం చెప్పాలి. మీడియాలో వస్తుందని నోటికొచ్చినట్లు మాట్లాడటం సరికాదు. పీఎం ఏక్తామాల్ టెండర్లు పారదర్శకంగా జరిగాయి. పరిశ్రమలు రావొద్దనే హిడెన్ అజెండాతో కేటీఆర్ ఆరోపణలు చేస్తున్నారు. ఆయన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం. నా శాఖలో జరిగే ప్రతి నిర్ణయం నాకు తెలుసు. ఎవరో చెప్తే నేను పనిచేసే రకం కాదు. బీఆర్ఎస్ హయాంలో లీజుకు ఇచ్చిన భూములను రెగ్యులరైజ్ చేశారు. అప్పుడు కేటీఆర్‌కు తప్పనిపించలేదా అని అన్నారు. బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి రావడం కలలో మాటని శ్రీధర్‌బాబు వ్యాఖ్యానించారు.

## అమ్మవారికి మారుబోనం
# సమర్పించిన మంత్రి సురేఖ

మొదటిపేజీ తరువాయి

ఆలయ ప్రధానార్చకులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి సురేఖ ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి మారు బోనం సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. బోనమెత్తిన మహిళలకు ఈ సందర్భంగా మంత్రి సురేఖ చీరె, సారె అందజేశారు. సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ, సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి మారుబోనం కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. అమ్మవారికి సమర్పించిన బియ్యంతో మారు బోనం చేయడం తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల్లో విశిష్టమైన ఆచారమని మంత్రి సురేఖ అన్నారు. అమ్మవారి ఆశీస్సులతో తెలంగాణ ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఆషాడ బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించుకోవడం మనందరికీ గర్వకారణమన్నారు. ఈ ఏడాది ఆషాడ బోనాల ఉత్సవాలను ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకుంటున్నారని తెలిపారు. ప్రభుత్వ ఏర్పాట్లకు తోడు ప్రజల సహకారంతో ఈ ఏడాది బోనాలు వైభవోపేతంగా జరుగుతున్నాయన్నారు.

# పాతబస్తీ మెట్రో పనుల్లో వేగం పెంచాలి

మొదటిపేజీ తరువాయి

పాతబస్తీ మెట్రో పనులపై సంబంధిత అధికారులతో సీఎం మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. పెండింగ్ భూసేకరణ పనులు వేగంగా పూర్తి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి మార్గనిర్దేశం చేశారు. మెట్రో రద్దీకి అనుగుణంగా అదనపు కోచ్‌లు కొనుగోలు చేయాలని సూచించారు. ప్రస్తుత టెక్నాలజీపై ఢిల్లీ మెట్రో సలహాలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. డిసెంబర్‌లో 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్' నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత సమ్మిట్ పెట్టుబడులపై పూర్తి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్ నిర్వహణకు ప్లాన్ చేస్తున్నామని సీఎం పేర్కొన్నారు. తెలంగాణలో మరిన్ని పెట్టుబడులు ఆకర్షించేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. వివిధ రంగాల్లో గుర్తింపు పొందిన ప్రముఖులను సన్మానించాలని సూచించారు. గత ఏడాది పెట్టుబడులు, పురోగతిపై పూర్తి వివరాలు ఇవ్వాలని ఆదేశించారు. పెట్టుబడుల్లో మరింత పురోగతికి ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు.

# ఎయిడ్స్ రహిత తెలంగాణ లక్ష్యం

మొదటిపేజీ తరువాయి

ఆగస్టు 12 నుంచి రెండు నెలల పాటు విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు. హెచ్‌ఐవీ, ఎయిడ్స్, సిఫిలిస్ నియంత్రణెళి లక్ష్యంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. బుధవారం ఉదయం 7 గంటలకు హైదరాబాద్‌లో భారీ ర్యాలీ చేపట్టనున్నట్లు చెప్పారు. ఐమాక్స్ పక్కన ఉన్న హెచ్‌ఎండీఏ గ్రౌండ్స్ నుంచి నెక్లెస్ రోడ్ రైల్వే స్టేషన్ వరకు ర్యాలీ కొనసాగనుందని మంత్రి తెలిపారు. సుమారు 1500 మంది ర్యాలీలో పాల్గొననున్నట్లు వెల్లడించారు. హెచ్‌ఐవీ బాధితులకు మెరుగైన వైద్య చికిత్స అందించడంపై ప్రత్యేక దృష్టి సారించామని మంత్రి తెలిపారు. హెచ్‌ఐవీ ఇతరులకు, ముఖ్యంగా పుట్టబోయే శిశువులకు సంక్రమించ కుండా అవగాహన కల్పిస్తున్నామన్నారు. సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ ఎయిడ్స్ నిర్మూలన ప్రచారంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. 'బి పాజిటివ్ టు స్టాప్ హెచ్‌ఐవీ పాజిటివ్' నినాదంతో అవగాహన కల్పించ నున్నట్లు తెలిపారు. తెలంగాణను హెచ్‌ఐవీ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. కాగా.. రేపు ఈ ర్యాలీని మంత్రులు దామోదర్ రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్.. జెండా ఊపి ప్రారంభించనున్నారు. కాలేజీ విద్యార్థులు, నర్సింగ్ విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల కార్యకర్తలు ర్యాలీలో పాల్గొననున్నారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
బుధవారం ఆగస్ట్ 12, 2026

# అంబేద్కర్ జీవిత చరిత్ర ను పాఠ్య పుస్తకాలలో చేర్చాలి







- భారత రాజ్యాంగ రక్షణ కు పోరాడుదాం
- అంబేద్కర్ ఆశయాలను ప్రతీ ఒక్కరూ కొనసాగించాలి
- కాక్రోచ్ లాగ అంబేద్కర్ వాదులకు అంతం ఉండదు
- మాల మహానాడు సంఘం మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు గుజ్జుక పరుశురాం

**కరపత్రం ప్రతినిధి ఆగస్టు 11,మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా.** దమ్మాయిగూడ డివిజన్ పరిధిలోనీ అర్జికే కాలనీలో అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో డా. బి.ఆర్. అంబేద్కర్ మహనీయుల 28వ వారం జ్ఞానమాల కార్యక్రమాన్ని ఆదివారం రోజున ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాల మహానాడు సంఘం మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు గుజ్జుక పరుశురాం హాజరై అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అంబేద్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ కొనసాగించాలని పిలుపునిచ్చారు. బాబాసాహెబ్ అంబేద్కర్ వేసిన బాటలో నడుస్తూ ఆయన సిద్ధాంతాన్ని ముందుకు తీసుకపోవాలని, దళిత బహుజన, ముస్లిమ్, క్రిస్టియన్ మైనార్టీ బిడ్డలకు అండగా నిలవాలని అన్నారు. భారత రాజ్యాంగాన్ని పరిరక్షించే దిశలో అందరు కలిసి పోరాడాలని కోరారు. రాబోయే కాలంలో మతతత్వ పార్టీలను బొందపెట్టాలని వెనుకబడిన తరగతుల వారిని కోరారు. కాక్రోచ్ లాగ అంబేద్కర్ వాదులకు అంతం ఉండదని అన్నారు. అంబేద్కర్ జీవిత చరిత్ర, ఆయన చేసిన కృషిని పాఠ్య పుస్తకాలలో చేర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం పరుశురాం ను సంఘం నేతలు శాలువతో సన్మానించారు. అంబేద్కర్ యొక్క పుస్తకాన్ని బహుమతిగా అందించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం గౌరవ అధ్యక్షుడు మాజీ కౌన్సిలర్ మంగళపూరి వెంకటేష్ ,దమ్మాయిగూడ డివిజన్ టిడిపి పార్టీ అధ్యక్షుడు కృష్ణ రావు, అంబేద్కర్ సంఘం ప్రధాన కార్యదర్శి ఉల్లి సురేష్ , మాల సంఘం అధ్యక్షుడు కోలాటి రాజు, ప్రధాన కార్యదర్శి గౌతమ్, కోశాధికారి పాడుగుల రూప చంద్రమౌళి, సలహాదారులు మాదసి రవి, రాజేంద్ర ప్రసాద్, మైనార్టీ అధ్యక్షుడు యూనిస్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ రామక్రిష్ణ , అంబేద్కర్ వాది పాడుగుల చంద్రమౌళి, ఖదీర్, రాంబాబు, రాధాక్రిష్ణ , వెంకటేశ్వర రావు, ఈశ్వరి , శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# బ్యాలెట్ పేపర్ పద్ధతిలో ఎన్నికలు పునరుద్ధరించాలి

-- ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షుడు అరెల్లి రవి, ప్రధాన కార్యదర్శి దామెర కృష్ణ

**కరపత్రం ప్రతినిధి చెన్నారావుపేట, ఆగస్టు 11**



బ్యాలెట్ పేపర్ పద్ధతిలో ఎన్నికలను పునరుద్ధరించి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షుడు అరెల్లి రవి, ప్రధాన కార్యదర్శి దామెర కృష్ణ డిమాండ్ చేశారు. సీపీఐ వరంగల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రాజకీయ ప్రచార పాదయాత్ర మూడో రోజు చెన్నారావుపేటకు చేరుకుంది.ఈ సందర్భంగా కళాకారులు ఆటపాటల ద్వారా నిరుద్యోగం, ధరల పెరుగుదల, రైతుల సమస్యలు, ప్రజాస్వామ్య పరిరక్షణ తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీలో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, విద్యా, వైద్యం అందుబాటులోకి తేవాలని, పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని వారు డిమాండ్ చేశారు.

ప్రతి యువకుడికి ఉద్యోగం కల్పించాలని, మహిళా రిజర్వేషన్లను తక్షణమే అమలు చేయాలని, కార్మిక హక్కులను పరిరక్షించాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 9 నుంచి 14 వరకు వరంగల్ జిల్లాలో ప్రచార యాత్ర నిర్వహిస్తున్నామని, సెప్టెంబర్ 1న న్యూఢిల్లీలో జరిగే 'బద్లావ్ జరూరీ హై' ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో ప్రజానాట్య మండలి కళాకారులు యాకూబీ, జన్ను రాజ, సువర్ణ, షఫీనా తదితరులు పాల్గొన్నారు.

# శ్రీవారి సన్నిధిలో బీసీల హక్కుల కోసం మొక్కు!

- తిరుమలలో శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించుకున్న జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి



**కరపత్రం ప్రతినిధి తిరుమల, ఆగస్టు 11**
కలియుగ వైకుంఠమైన తిరుమలలో శ్రీవేంకటేశ్వర స్వామివారిని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు, బీసీ రిజర్వేషన్ల సాధన సమన్వయ జేఏసీ చైర్మన్ దుండ్ర కుమారస్వామి సోమవారం దర్శించుకున్నారు. అనంతరం వేద పండితుల ఆశీర్వచనం పొందారు.శ్రీవారి పిలుపు ఉంటేనే దర్శన భాగ్యం లభిస్తుందని, స్వామివారి దర్శనం మనసుకు ప్రశాంతతతో పాటు నూతన విశ్వాసాన్ని అందిస్తుందని కుమారస్వామి అన్నారు. దేశ ప్రజలందరూ శాంతి, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని శ్రీవారిని ప్రార్థించినట్లు తెలిపారు.

బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, జనాభా ప్రాతిపదికన తగిన రిజర్వేషన్లు కల్పించేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కోరుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. బీసీల సంక్షేమానికి మరింత ప్రాధాన్యం కల్పించేలా స్వామివారి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు.

**సన్నిధి గొల్ల రమేష్ యాదవ్‌తో భేటీ**

తిరుమల శ్రీవారి దర్శన సంప్రదాయంలో సన్నిధి గొల్లలకు ఉన్న ప్రాచీన విశిష్ట హక్కు సనాతన ధర్మ, ఆధ్యాత్మిక చరిత్రలో ప్రత్యేకమైనదని కుమారస్వామి పేర్కొన్నారు. ఈ వంశపారంపర్య సంప్రదాయాన్ని కొనసాగిస్తున్న ప్రస్తుత సన్నిధి గొల్ల శ్రీ రమేష్ యాదవ్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ కార్యక్రమంలో యాదవ హక్కుల సంక్షేమ సంఘం కార్యదర్శి మణికంఠేశ్వర యాదవ్, రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

"గోవిందా.. గోవిందా.." అంటూ భక్తిభావంతో శ్రీవారిని స్మరించిన కుమారస్వామి, ప్రజలందరి సుఖశాంతులను ఆకాంక్షించారు.

# గుప్త నిధుల పేరుతో రూ.కోటి మోసం

- నలుగురు సభ్యుల ముఠా అరెస్ట్.. నకిలీ బంగారు నాణేలు, పూజా సామగ్రి స్వాధీనం

**కరపత్రం ప్రతినిధి హైదరాబాద్ ప్రతినిధి గౌరవ్ బీడ్కర్, ఆగస్టు 11**
గుప్త నిధుల పేరుతో అమాయక ప్రజలను నమ్మించి భారీగా డబ్బులు వసూలు చేస్తున్న నలుగురు సభ్యుల ముఠాను శంషాబాద్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు, రాజేంద్రనగర్ పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి రెండు కార్లు, ఆటో, రెండు ద్విచక్ర వాహనాలు, నాలుగు సెల్‌ఫోన్లు, 25 నకిలీ బంగారు పూత నాణేలు, ఆరు కిలోల బొగ్గు, నాలుగు కిలోల మట్టి, పూజా సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. అరెస్టైన వారిలో మొహమ్మద్ మునావర్ అలియాస్ మున్నా (36), సయ్యద్ అలీ అష్రఫ్ (40), మొహమ్మద్ హాజీ (25), మొహమ్మద్ సల్మాన్ (29) ఉన్నారు. ప్రధాన నిందితుడైన మునావర్‌పై గతంలోనూ బేగంబజార్ పోలీస్‌స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదైనట్లు పోలీసులు తెలిపారు.



పోలీసుల వివరాల ప్రకారం.. మునావర్ తనకు గుప్త నిధులను గుర్తించి వెలికితీసే ప్రత్యేక విద్య, శక్తులు ఉన్నాయని ప్రచారం చేసుకుంటూ అమాయకులను లక్ష్యంగా చేసుకునేవాడు. ముందుగా బాధితులను నమ్మించి వారి ఇళ్ల వద్ద లేదా అనువైన ప్రదేశాల్లో గుంతలు తవ్వించేవారు. అనంతరం అందులో బొగ్గు, నకిలీ బంగారు నాణేలు ఉన్న సంచులను రహస్యంగా దాచేవారు. ఆ తర్వాత పూజలు, తంతుల పేరుతో హంగామా సృష్టించి.. బొగ్గు క్రమంగా బంగారంగా మారేందుకు సమయం పడుతుందని నమ్మించేవారు. ఈ క్రమంలో బాధితుల నుంచి విడతల వారీగా భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేసేవారు. ఇలా సుమారు 11 మందిని మోసం చేసి రూ.కోటి వరకు వసూలు చేసినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది.

నిందితుల మోసపూరిత వ్యవహారంపై సమాచారం అందుకున్న శంషాబాద్ జోన్ టాస్క్‌ఫోర్స్, రాజేంద్రనగర్ పోలీసులు సంయుక్తంగా దర్యాప్తు చేపట్టి ముఠాను పట్టుకున్నారు. నిందితుల వద్ద నుంచి మోసాలకు ఉపయోగించిన వస్తువులను స్వాధీనం చేసుకున్నారు.

గుప్త నిధులు బయటకు తీస్తామని, తమకు ప్రత్యేక శక్తులు ఉన్నాయని చెప్పే వ్యక్తులను నమ్మి డబ్బులు ఇవ్వవద్దని పోలీసులు ప్రజలకు సూచించారు. ఇలాంటి అనుమానాస్పద వ్యక్తులు, మోసపూరిత కార్యకలాపాలపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. ఈ కేసును శంషాబాద్ జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ కె. రవి, ఎస్ఐలు ఎల్.కె. మాన్సూర్ అలీ, నర్సింగరావు, ఎస్. శేషు తమ సిబ్బందితో కలిసి రాజేంద్రనగర్ పోలీసులతో సమన్వయంతో ఛేదించారు.

# అమ్మవారి ఆశీస్సులతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి

- ఉజ్జయిని మహంకాళికి మారు బోనం సమర్పించిన మంత్రి కొండా సురేఖ





**కరపత్రం ప్రతినిధి వరంగల్ ఆగస్టు 11**
సికింద్రాబాద్: ఆషాఢ బోనాల ఉత్సవాల్లో భాగంగా సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి అటవీ,పర్యావరణ,దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మంగళవారం మారు బోనం సమర్పించారు.ఆలయానికి చేరుకున్న మంత్రికి దేవాదాయ శాఖ అధికారులు,అర్చకులు డప్పు చప్పుళ్లు,శివసత్తుల పూనకాల మధ్య ఘన స్వాగతం పలికారు.అనంతరం అమ్మవారిని దర్శించుకున్న మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించి మారు బోనం సమర్పించారు.బోనం ఎత్తిన మహిళలకు మంత్రి సురేఖ చీర,సారె అందజేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..అమ్మవారికి సమర్పించిన బియ్యంతో మారు బోనం చేయడం తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాల్లో విశిష్టమైన ఆచారమన్నారు.ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆశీస్సులతో తెలంగాణ ప్రజలంతా సుఖసంతోషాలతో,ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.ఆషాఢ బోనాలు తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తున్నాయని,భక్తిశ్రద్ధలతో పండుగను ఘనంగా నిర్వహించుకోవడం గర్వకారణమన్నారు.ప్రభుత్వ ఏర్పాట్లకు ప్రజల సహకారం తోడవడంతో ఈ ఏడాది బోనాల ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయని తెలిపారు.కార్యక్రమంలో దేవాదాయ శాఖ డైరెక్టర్ హనుమంతరావు,అసిస్టెంట్ కమిషనర్ మనోహర్‌రెడ్డి,ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

# గుంతలమయంగా లేబర్ కాలనీ రోడ్డు

- ప్రతి మూడు నెలలకోసారి ఇదే తంతు.. తాత్కాలిక మరమ్మతులతో ప్రయోజనం శూన్యం






**కరపత్రం ప్రతినిధి వరంగల్, ఆగస్టు 11**
వరంగల్ నగరంలోని నర్సంపేట రోడ్డులో గల లేబర్ కాలనీలో రహదారి పరిస్థితి అధ్వానంగా మారింది. గౌరయ్య షాపు ఎదురుగా, మాజీ కాంగ్రెస్ కార్పొరేటర్ ఇంటి ముందు ఉన్న రోడ్డుపై భారీ గుంతలు ఏర్పడటంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొద్ది పాటి వర్షం కురిసినా గుంతల్లో నీరు నిలిచి రహదారి మరింత ప్రమాదకరంగా మారుతోందని స్థానికులు చెబుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో గుంతలు కనిపించకపోవడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి నెలకొంది. గుంతలను తప్పించుకునే క్రమంలో వాహనాలు అదుపుతప్పుతున్న ఘటనలు కూడా చోటుచేసుకుంటున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**మూడు నెలలకోసారి మరమ్మతులు.. మళ్లీ గుంతలే..**

ఈ రహదారికి ప్రతి మూడు నెలలకోసారి తాత్కాలిక మరమ్మతులు చేపట్టడం, కొద్దిరోజులకే మళ్లీ గుంతలు ఏర్పడటం పరిపాటిగా మారిందని స్థానికులు వాపోతున్నారు. నాణ్యత లేని తాత్కాలిక పనులతో ప్రజాధనం వృథా అవుతోందని, సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడం లేదని అంటున్నారు.

**శాశ్వత పరిష్కారం చూపాలి**

ప్రజల రాకపోకలకు కీలకంగా ఉన్న ఈ రహదారిని అధికారులు వెంటనే పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు. గుంతలు పూడ్చే తాత్కాలిక పనులతో సరిపెట్టకుండా రహదారి నాణ్యతను పరిశీలించి, అవసరమైన చోట పూర్తిస్థాయి రోడ్డు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రజల భద్రతను దృష్టిలో పెట్టుకుని సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# మధుప్రసన్న మృతి కేసులో కీలక పరిణామం తల్లి ఫిర్యాదుతో హత్యకేసు నమోదు

నగరంలో శాంతినగర్‌కు చెందిన యువతి మధుప్రసన్న మృతి కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. తమ కుమార్తెను దారుణంగా హత్య చేశారని ఆమె తల్లి జ్యోతి మూడో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కోటిలింగాలపేటకు చెందిన అభిలాష్ సర్జికల్ బ్లేడుతో దాడి చేసి చంపాడని అందులో పేర్కొన్నారు. మధుప్రసన్నకి జూన్ 21న మరో యువకుడితో నిశ్చితార్థం చేశాం. ఈనెల 27న వివాహం జరగాల్సి ఉంది. తననే పెళ్లి చేసుకోవాలని కొన్ని రోజులుగా అభిలాష్ వెంటపడుతున్నాడు. పెద్దలు కుదిర్చిన పెళ్లి చేసుకుంటానని మధుప్రసన్న చెప్పడంతో కోపం పెంచుకున్నాడు. మాట్లాడుకుందామని మభ్యపెట్టి బైక్‌పై గామన్ బ్రిడ్జి వద్దకు తీసుకెళ్లాడు. అక్కడ బ్లేడుతో దాడి చేశాడు. మధుప్రసన్న తప్పించుకునే ప్రయత్నం చేసే క్రమంలోనే యువకుడి చేతిపై గాయమైనట్లు అనుమానముంది. తమ కుమార్తెను దారుణంగా చంపిన అభిలాష్‌ను కఠినంగా శిక్షించాలి' అని జ్యోతి తన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో పోలీసులు యువకుడిపై హత్య కేసు నమోదు చేశారు. రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో పోస్టుమార్టం అనంతరం యువతి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. కేసుపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# కాకతీయ జూలాజికల్ పార్కు అభివృద్ధికి కాంపా నిధులు మంజూరు చేయాలి

- ఎన్‌క్లోజర్లు, రాత్రి నివాసాల నిర్మాణానికి త్వరగా అనుమతులు ఇవ్వాలి
- జంతువుల కదలికలపై శబ్ద, దృశ్య పర్యవేక్షణ వ్యవస్థ ఏర్పాటు చేయాలి
- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య

**కరపత్రం ప్రతినిధి హనుమకొండ, ఆగస్టు 11**
కాకతీయ జూలాజికల్ పార్కు సమగ్ర అభివృద్ధికి పరిహార అటవీకరణ నిధుల నిర్వహణ, ప్రణాళిక ప్రాధికార సంస్థ (కాంపా) నిధులు మంజూరు చేయాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య కోరారు. ఈ మేరకు మంగళవారం న్యూఢిల్లీలో కేంద్ర జంతుప్రదర్శనశాల ప్రాధికార సంస్థ సభ్య కార్యదర్శి డాక్టర్ వి. క్లెమెంట్ బెన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. హనుమకొండలోని కాకతీయ జూలాజికల్ పార్కులో సింహాల ఆవరణ, రాత్రి నివాసం, హైనా, నక్క, అడవి కుక్కల ఆవరణలు, రాత్రి నివాసాలు, సరీసృపాల ఆవరణల నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలను తెలంగాణ అటవీ శాఖ ఇప్పటికే కేంద్ర జంతుప్రదర్శనశాల ప్రాధికార సంస్థకు సమర్పించిందని కడియం కావ్య తెలిపారు. సాంకేతిక కమిటీ సూచనల మేరకు ప్రతిపాదనల్లో అవసరమైన సవరణలు చేసి, నమూనా చిత్రాలు, నిర్మాణ చిత్రాలను కూడా సమర్పించినందున వాటికి త్వరితగతిన అనుమతులు మంజూరు చేయాలని కోరారు. సుమారు 50 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న జూలాజికల్ పార్కులో జంతువుల సంరక్షణతో పాటు మొక్కల పెంపకం, పచ్చదనం అభివృద్ధి, పార్కు విస్తరణకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. కాంపా నిధులను విడుదల చేసి ఆయా అభివృద్ధి పనులకు వినియోగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.



**జంతువుల భద్రతకు ఆధునిక పర్యవేక్షణ**

జంతువుల కదలికలు, ప్రవర్తనను నిరంతరం గమనిస్తూ వాటి సంరక్షణ, భద్రతను పర్యవేక్షించేందుకు దృశ్య, శబ్ద రికార్డింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కడియం కావ్య సూచించారు. ఆధునిక పర్యవేక్షణ సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా జంతువుల ఆరోగ్యం, ప్రవర్తన, భద్రతపై నిరంతర నిఘా ఉంచవచ్చని తెలిపారు.

**పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి**

కాకతీయ జూలాజికల్ పార్కును వన్యప్రాణి సంరక్షణ, పర్యావరణ విద్య, పర్యావరణ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తే వరంగల్‌కు వచ్చే పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశం ఉందని కడియం కావ్య పేర్కొన్నారు. దీనివల్ల స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు ఆర్థిక కార్యకలాపాలు కూడా మెరుగుపడతాయని తెలిపారు. ఎంపీ చేసిన విజ్ఞప్తులపై కేంద్ర జంతుప్రదర్శనశాల ప్రాధికార సంస్థ సభ్య కార్యదర్శి డాక్టర్ వి. క్లెమెంట్ బెన్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కాకతీయ జూలాజికల్ పార్కు అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలను పరిశీలించి, నిబంధనల మేరకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు కడియం కావ్య వెల్లడించారు.

# బత్తిని మొగిలయ్య గౌడ్ త్యాగం చిరస్మరణీయం

- నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలి
- పార్టీలకు అతీతంగా గౌడులు ఏకం కావాలి: వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్



**కరపత్రం ప్రతినిధి వరంగల్, ఆగస్టు 11**
నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా జాతీయ జెండా కోసం ప్రాణత్యాగం చేసిన బత్తిని మొగిలయ్య గౌడ్ త్యాగం చిరస్మరణీయమని, నేటి యువత మొగిలయ్య గౌడ్ దేశభక్తి, త్యాగస్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ పిలుపు నిచ్చారు. మంగళవారం బత్తిని మొగిలయ్య గౌడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వరంగల్‌లోని బత్తిని మొగిలయ్య గౌడ్ హాల్‌లో ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి కూనూరు రంజిత్ అధ్యక్షతన మొగిలయ్య గౌడ్ 80వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వేణుగోపాల్ గౌడ్ మాట్లాడుతూ.. బలమైన దేహంతో పాటు దేశభక్తిని నింపుకున్న మొగిలయ్య గౌడ్ గీత కార్మికుడిగా జీవనం సాగిస్తూనే ఆర్యసమాజ్ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేవారని తెలిపారు. మొగిలయ్య గౌడ్ సోదరుడు బత్తిని రామస్వామి కూడా అంకితభావంతో పనిచేసిన దేశభక్తుడని, వీరిద్దరి కృషితో వరంగల్ కోటలో శాంతి, సామరస్య వాతావరణం నెలకొనేదని వివరించారు. వరంగల్ కోటలో జాతీయ జెండాను ఎగురవేయాలని అప్పటి దేశభక్తులు నిర్ణయించుకున్నారని, అయితే నిజాం ప్రభుత్వం అధికారికంగా త్రివర్ణ పతాక ఆవిష్కరణను నిషేధించిందని చెప్పారు.

**1946 ఆగస్టు 11న వరంగల్ తూర్పు కోటలో జాతీయ జెండా ఆవిష్కరణ**

1946 ఆగస్టు 11న బత్తిని రామస్వామి ఆధ్వర్యంలో హయగ్రీవాచారి, భూపతి కష్టమూర్తి, కె. సమ్మయ్య, మదూరి రాజలింగం, మల్లయ్య, ఆరెల్లి బుచ్చయ్యతో పాటు ఆర్యసమాజ్ కార్యకర్తలు, కాంగ్రెస్ స్వచ్ఛంద కార్యకర్తలు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా వరంగల్ తూర్పు కోటలో జాతీయ జెండాను ఆవిష్కరించారని వేణుగోపాల్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా పిల్లలు, పెద్దలు దేశభక్తి గీతాలు ఆలపించారని గుర్తుచేశారు. కోటపై జాతీయ జెండా ఎగురుతోందన్న విషయం తెలుసుకున్న రజాకార్లు ఖాసీం షరీఫ్ నాయకత్వంలో సుమారు 200 మందితో జెండా ఆవిష్కరించిన నాయకులపై దాడికి వచ్చారని తెలిపారు. ఆ సమయంలో దేశభక్తులను కాపాడేందుకు బత్తిని మొగిలయ్య గౌడ్ ప్రాణాలను పణంగా పెట్టి పోరాడి అమరుడయ్యారని పేర్కొన్నారు. ఆయన అమరత్వం తెలంగాణ చరిత్రలో ఎప్పటికీ నిలిచిపోతుందని అన్నారు.

**గౌడులకు అన్ని పార్టీలు 10 స్థానాలు కేటాయించాలి**

రాజకీయాలకు అతీతంగా గౌడ కులస్తులంతా ఐక్యంగా ఉండాలని వేణుగోపాల్ గౌడ్ పిలుపునిచ్చారు. బీసీ వర్గాల్లో అధిక జనాభా కలిగిన గౌడ సామాజిక వర్గానికి రానున్న వరంగల్ మహానగర పాలక సంస్థ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు కనీసం 10 స్థానాలు కేటాయించాలని కోరారు. యువత రాజకీయాల్లోకి వచ్చి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. మోకుదెబ్బ రాష్ట్ర కార్యదర్శి అనంతుల రమేష్ గౌడ్ మాట్లాడుతూ.. బత్తిని మొగిలయ్య గౌడ్ జయంతి, వర్ధంతి కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరారు. ఆయన త్యాగాన్ని భవిష్యత్ తరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

**వరంగల్‌లో మొగిలయ్య గౌడ్ విగ్రహం**

బత్తిని మొగిలయ్య గౌడ్ స్మారకార్థం వరంగల్‌లో ఆయన విగ్రహాన్ని త్వరలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్నట్లు ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ఉపాధ్యక్షులు ఉమ్మగాని గణేష్, గట్ల యుగందర్, బండారి జనార్దన్ గౌడ్, మార్క రవి గౌడ్, పులి నర్సింగ్ గౌడ్, బత్తిని వెంకటేష్, గట్టు చందు, గట్టు రమేష్, మాడురి సోమయ్య, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

## మిరియాల శారద భౌతిక కాయానికి నివాళులర్పించిన ఎర్రబెల్లి ప్రదీప్‌రావు

- కుటుంబ సభ్యులను పరామర్శించిన బీజేపీ రాష్ట్ర నాయకుడు ప్రదీప్ రావు





**కరపత్రం ప్రతినిధి వరంగల్ ఆగస్టు 11**
వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని ఉర్సు కరీమాబాద్ ప్రాంతానికి చెందిన బీజేపీ నాయకుడు మిరియాల ఆదిత్య చిన్న తల్లి మిరియాల శారద మృతి చెందారు. విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర నాయకుడు, వరంగల్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు శారద పార్థివదేహానికి పూలమాల వేసి, ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. శారద మృతి కుటుంబానికి తీరని లోటని,ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.

## దేవాదుల కింద 20 టీఎంసీల నీటిని వినియోగించుకునే అవకాశం

- సెప్టెంబర్ చివరి వరకు పూర్తిస్థాయిలో పంపింగ్ చేయాలి: ఎమ్మెల్యే కడియం శ్రీహరి





**కరపత్రం ప్రతినిధి బ్యూరో, ఆగస్టు 11**
దేవాదుల ఎత్తిపోతల పథకం ద్వారా మరో 15 టీఎంసీల నీటిని ఎత్తిపోసి రైతులకు సాగునీరు అందించేందుకు సెప్టెంబర్ చివరి వరకు పూర్తిస్థాయిలో పంపింగ్ చేయాలని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సూచించారు. మొత్తం తొమ్మిది మోటార్లను నిరంతరాయంగా నడిపితే రోజుకు సుమారు 2 వేల క్యూసెక్కుల నీటిని ఎత్తిపోసే అవకాశం ఉందని తెలిపారు. మంగళవారం హనుమకొండ చింతగట్టులోని నీటిపారుదల శాఖ కార్యాలయంలో ఈఎన్‌సీ రమేష్ ఆధ్వర్యంలో అధికారులు, కాంట్రాక్టర్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కడియం శ్రీహరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి రి మాట్లాడుతూ..
దేవాదుల కింద 20 టీఎంసీల నీటిని వినియోగించుకునే అవకాశం ఉండగా ఇప్పటివరకు 5 టీఎంసీలు మాత్రమే ఎత్తిపోశామని, మిగిలిన 15 టీఎంసీలను కూడా వినియోగించుకోవాలని సూచించారు. ధర్మసాగర్ నుంచి ఘన్‌పూర్ వరకు సొరంగం పనులు పూర్తయినప్పటికీ వినియోగంలోకి రాలేదని, వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. దేవాదుల పరిధిలోని రామప్ప, ధర్మసాగర్, ఘన్‌పూర్ రిజర్వాయర్లు కీలకమైనవని, రామప్ప, ఘన్‌పూర్, చలివాగు రిజర్వాయర్లలో నీటిమట్టాలను నిర్దేశిత స్థాయిలో నిర్వహించేందుకు కార్యాచరణ మార్గదర్శకాలు రూపొందించాలని సూచించారు. పంటల అవసరాలను పరిశీలించి రైతులకు సాగునీరు అందించాలని అన్నారు.

**పనుల్లో వేగం పెంచాలి**

దేవాదుల మూడో దశ, ప్యాకేజీ-6 పనులు నత్తనడకన సాగుతున్నాయని కడియం శ్రీహరి అన్నారు. ఈ ప్యాకేజీ ద్వారా నాలుగు నియోజకవర్గాల్లోని 78 వేల ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉందని తెలిపారు. యంత్ర సామగ్రి, సిబ్బందిని పెంచకుండా పనులు కొనసాగిస్తే మరో పదేళ్లు పట్టినా పూర్తి కావని, అధికారులు, కాంట్రాక్టర్లు సమన్వయంతో పనుల వేగాన్ని పెంచాలని సూచించారు. కాంట్రాక్టర్ల బిల్లుల సమస్యను ఇప్పటికే మంత్రి దృష్టికి తీసుకెళ్లామని, త్వరలోనే బిల్లులు పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. వచ్చే యాసంగి నాటికి పాలకుర్తి వరకు నీరు అందేలా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.
గండి రామారం ఎత్తిపోతల పథకంలో రెండో ఎత్తిపోత పనులు పూర్తయ్యాయని, మొదటి ఎత్తిపోత పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. మొదటి ఎత్తిపోత పనులను అక్టోబర్ చివరి నాటికి పూర్తి చేసి, మూడో ఎత్తిపోత పనులను చేపట్టాలని సూచించారు. రానున్న 45 రోజుల పాటు మోటార్లను పూర్తిస్థాయిలో నడిపి రైతుల పంటలకు నిరంతరాయంగా సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యేలు మామిడాల యశస్విని రెడ్డి, కేఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణరావు, సీఈ సుధీర్, ఎస్ఈ సీతారాం, దర్శన్, డీఈలు, ఈఈలు, నీటిపారుదల శాఖ అధికారులు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యంలో ఓటే కీలకం

- బీఎల్‌వోలు, బీఎల్‌ఏల సేవలు అభినందనీయం: బీఆర్ఎస్ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ పులి రజినీకాంత్ ముదిరాజ్





**కరపత్రం ప్రతినిధి హనుమకొండ, ఆగస్టు 11**
ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత కీలకమని బీఆర్ఎస్ పార్టీ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ పులి రజినీకాంత్ ముదిరాజ్ అన్నారు. తెలంగాణ ఎన్నికల సంఘం నిర్వహించిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా విధులు నిర్వర్తించిన బీఎల్‌వోలు, రాజకీయ పార్టీలు నియమించిన బీఎల్‌ఏలను మంగళవారం మచిలీబజార్‌లోని పార్టీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బీఎల్‌వోలు, బీఎల్‌ఏలను శాలువాలతో సత్కరించి, చిరుకానుకలు అందజేశారు. అనంతరం పులి రజినీకాంత్ మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ ప్రక్రియలో బీఎల్‌వోలు, బీఎల్‌ఏలు ఎంతో బాధ్యతతో పనిచేశారని ప్రశంసించారు. ప్రజల ఓటు మ్యాపింగ్, ఎన్యుమరేషన్ ఫారాల పూర్తి, డిజిటలైజేషన్ తదితర ప్రక్రియలను సమర్థవంతంగా నిర్వహించడంలో వారు కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. ప్రతి పౌరుడు తన ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలని, అర్హులైన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా తమ ఓటును నమోదు చేసుకోవాలని రజినీకాంత్ కోరారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది అని, ఓటర్ల జాబితా పారదర్శకంగా, తప్పుల్లేకుండా ఉండేందుకు బీఎల్‌వోలు, బీఎల్‌ఏలు చేసిన కృషి అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఎల్‌వోలు సుష్మ, చంద్ర, నవ్య, రాజశ్రీ, నస్రిన్, అశోక్, నజుమా, కవిత, సంతోష, అస్మా, సరస్వతి, విజయ, రాజు, కుమార్‌తో పాటు బీఆర్ఎస్ పార్టీ బీఎల్‌ఏలు రఘు, స్రవంతి, వరుణ్, శ్యామ్, హరికృష్ణ, సుమిత్ర, నందకిషోర్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మెగా టెక్స్‌టైల్ పార్క్ పురోగతిపై కేంద్రాన్ని ప్రశ్నించిన వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య

- భూసేకరణ, మౌలిక వసతులు, పెట్టుబడులు, ఉద్యోగాలపై లోక్‌సభలో ప్రశ్న
- స్థానిక యువత, మహిళలు, ఎస్సీ, ఎస్టీలకు ఉపాధి అవకాశాలపై స్పష్టత కోరిన ఎంపీ
- వరంగల్ నుంచి వలసలు తగ్గేలా స్థానిక ఉపాధి అవకాశాలు పెంచాలి



**కరపత్రం ప్రతినిధి న్యూఢిల్లీ, ఆగస్టు 10**
వరంగల్‌లో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పీఎం మిత్ర మెగా టెక్స్‌టైల్ పార్క్ అమలు పురోగతిపై వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డా. కడియం కావ్య లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పార్క్‌లో భూసేకరణ, మౌలిక వసతుల కల్పన, పెట్టుబడుల ఆకర్షణ, ఉత్పత్తి ప్రారంభం, ఉద్యోగాల కల్పనపై వివరాలు వెల్లడించాలని ఎంపీ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ముఖ్యంగా స్థానిక యువత, మహిళలు, ఎస్సీలు, ఇతర వెనుకబడిన వర్గాలకు ఎన్ని ఉపాధి అవకాశాలు లభిస్తాయో స్పష్టత ఇవ్వాలని ప్రశ్నించారు. వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అడిగిన ప్రశ్నకు కేంద్ర జౌళి శాఖ సహాయ మంత్రి పబిత్ర మార్గెరిటా లోక్‌సభలో దేశవ్యాప్తంగా ఏడు పీఎం మిత్ర పార్కులను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అందులో తెలంగాణలోని వరంగల్‌ను ఒక ప్రాంతంగా ఎంపిక చేసినట్లు వెల్లడించారు. వరంగల్ పార్క్‌ను బ్రౌన్‌ఫీల్డ్ కేటగిరీలో అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు.

**కేంద్రం సమాధానంపై ఎంపీ డా. కడియం కావ్య**

వరంగల్ పీఎం మిత్ర పార్క్ కేవలం ఒక పారిశ్రామిక ప్రాజెక్టు కాకుండా తెలంగాణలోనే అతిపెద్ద ఉపాధి, పెట్టుబడుల కేంద్రంగా ఎదగాల్సిన అవసరం ఉందన్నారు. అయితే భవిష్యత్తులో ప్రకటించిన లక్ష్యాలకు అనుగుణంగా పెట్టుబడులు, పరిశ్రమలు, ఉద్యోగాల కల్పన వేగంగా పెరగాలని అన్నారు. వరంగల్‌లోని యువతకు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే నాణ్యమైన ఉద్యోగాలు, నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పించడమే తన ప్రధాన లక్ష్యమని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళలు, ఎస్సీలు, ఎస్టీలు, బలహీన వర్గాలకు పార్క్‌లో తగిన ప్రాధాన్యత కల్పించేలా కేంద్రం ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. వరంగల్‌ను జౌళి రంగానికి జాతీయ స్థాయి హబ్‌గా తీర్చిదిద్దేందుకు తాను నిరంతరం కృషి చేస్తానని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య స్పష్టం చేశారు. వరంగల్ ప్రజలకు మరిన్ని పెట్టుబడులు, పరిశ్రమలు, ఉద్యోగాలు తీసుకురావడానికి తన ప్రయత్నాలు నిరంతరం కొనసాగుతాయని వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య తెలిపారు.

## శ్రీకాళహస్తి హత్య కేసును ఛేదించిన పోలీసులు హంతకులు నలుగురిని అరెస్ట్ చేసినట్లు వెల్లడి

శ్రీకాళహస్తిలో సంచలనంగా మారిన హత్య కేసును తిరుపతి జిల్లా పోలీసులు ఛేదించారు. ఈ కేసుకు సంబంధించి అంతర్రాష్ట్ర నేరచరిత్ర కలిగిన నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు. ఆగస్టు 2న రాత్రి 7:30 గంటల సమయంలో శ్రీకాళహస్తి పీఆర్ గేట్ ప్రాంతంలో స్వర్ణముఖి నది కట్టపై శివ అనే వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. కేసు నమోదు చేసిన పోలీసులు.. టెక్నికల్ ఆధారాలు, సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా నిందితులను గుర్తించారు. వారిని అరెస్ట్ చేసి.. హత్యకు ఉపయోగించిన ఆయుధాలు, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. తమిళనాడుకు చెందిన ముగ్గురు, పుత్తూరుకు చెందిన ఒకరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితులపై తమిళనాడు రాష్ట్రంలో గతంలో పలు క్రిమినల్ కేసులు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. చెన్నైకి చెందిన థొప్పై గణెళిశన్ గ్యాంగ్‌తో నిందితులకు సంబంధాలు ఉన్నట్లు గుర్తించారు. హత్యకు ఉపయోగించిన బైక్, రెండు కత్తులు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న మరో నిందితుడి కోసం ప్రత్యేక పోలీసు బృందాలతో గాలింపు చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. నిందితులపై పీడీ యాక్ట్ నమోదు చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. కేసును ఛేదించడంలో కీలకంగా పనిచేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ సుబ్బరాయుడు అభినందించారు.

## సీఎం సభకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలి

- కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి
- వరంగల్ సిపి శ్వేతతో కలిసి ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్



**కరపత్రం ప్రతినిధి బ్యూరో, ఆగస్టు 11**
పరకాలలో ఈ నెల 16న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పాల్గొనే సభకు పటిష్టమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం పరకాలలో సీఎం పర్యటన నేపథ్యంలో ప్రతిపాదిత హెలిప్యాడ్, సభా వేదిక, వాహనాల పార్కింగ్, రాకపోకల మార్గాలు, భద్రతా ఏర్పాట్లను వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేతతో కలిసి కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నూతనంగా నిర్మించిన ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి వద్ద సీఎం ప్రారంభోత్సవ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. ప్రతిపాదిత హెలిప్యాడ్ కోసం లలితా కన్వెన్షన్ హాల్ సమీపంలోని స్థలాన్ని, సభా వేదిక, వాహనాల పార్కింగ్ కోసం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, అంగడి స్థలాలను పరిశీలించారు. సభకు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చే అవకాశం ఉన్నందున వాహనాల రాకపోకలు, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణకు ముందస్తు ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి మాట్లాడుతూ, సీఎం పర్యటనలో ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. హెలిప్యాడ్ నుంచి సీఎం ప్రయాణించే మార్గం, ఆసుపత్రి ప్రారంభోత్సవం, సభా వేదిక, ప్రజల రాకపోకలు, పార్కింగ్, రహదారులు, విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత మాట్లాడుతూ, సీఎం భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ హెలిప్యాడ్, రూట్ మ్యాప్, సభా ప్రాంగణం, పార్కింగ్ ప్రాంతాలు, ట్రాఫిక్ నియంత్రణకు పటిష్టమైన భద్రతా ప్రణాళిక అమలు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. అనంతరం సీఎం పర్యటనకు సంబంధించిన రూట్ మ్యాప్, భద్రతా ఏర్పాట్లు, పార్కింగ్ ప్రణాళికపై కలెక్టర్, పోలీస్ కమిషనర్ అధికారులతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ అంకిత్ కుమార్, అదనపు కలెక్టర్ రవి, డీఆర్డీవో మేన శ్రీను, స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ శేషాద్రి, ఆర్అండ్‌బీ ఎస్ఈ సురేష్ బాబు, ఈఈ దేవిక, టీడబ్ల్యూఐడీసీ ఈఈ అరుణ్ కుమార్, డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య, పరకాల మున్సిపల్ చైర్మన్ సునీల్ కుమార్, మున్సిపల్ కమిషనర్ పవన్,
ఏసీపీ సతీష్ బాబు, పరకాల సీఐ క్రాంతి కుమార్, కౌన్సిలర్లు శ్రీనివాస్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.